# అనారోగ్యంతో బాధపడుతున్న బాధితురాలికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆర్థికసాయం



రాయపర్తి, అక్టోబర్ 26,(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన చిర్ర ఈరమ్మ గత కొద్ది రోజులుగా డెంగ్యూ జ్వరంతో బాధపడుతున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఈరమ్మ వైద్య ఖర్చులకు, కుటుంబ సభ్యులు చిర్ర సప్తగిరి, యుగంధర్ ఇబ్బంది పడుతున్న సమాచారం తెలుసుకుని, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత పరుపాటి శ్రీనివాస్ రెడ్డి శనివారం హాస్పిటల్ వెళ్లి, బాధితులకు 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఆపద అనగానే స్పందించి, నిరుపేద కుటుంబాలకు ఆర్థికంగా సహకరించి, ఆర్థికంగా చేయూతనిస్తున్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత పరుపాటి శ్రీనివాస్ రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చిర్ర ఈరమ్మ ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఆమెకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. వారి వెంట లేతకుల మహేందర్ రెడ్డి, యాదవ రెడ్డి, సురేందర్ రెడ్డి, కోల సంపత్, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.



# యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపిన టెస్కాబ్ చైర్మన్ రవీందర్ రావు

వరంగల్, అక్టోబర్ 26,(జర్నలిస్ట్ వార్త): హనుమకొండ పట్టణ కేంద్రంలో శనివారం వార్త దినపత్రిక కార్యాలయాన్ని టెస్కాబ్ చైర్మన్ రవీందర్ రావు ప్రారంభించారు. హన్మకొండ, వరంగల్ జిల్లా ప్రాంతంలో ప్రాంతీయ కార్యాలయం ప్రారంభించిన యాజమాన్యానికి రవీందర్ రావు శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట నాయకులు, రిపోర్టర్లు తదితరులు ఉన్నారు.

# ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి

## - జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి




వరంగల్ బ్యూరో, అక్టోబర్ 26,(జర్నలిస్ట్ వార్త): ప్రత్యేక ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను మానవతా దృక్పథంతో సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన దివ్యాంగులు, వయోవృద్ధుల ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలసి వినతులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుండి దివ్యాంగులు, వయోవృద్ధులు వివిధ రకాల సమస్యల పరిష్కారానికి మొత్తం (8) దరఖాస్తులు సమర్పించారు. అందులో 4 డీఆర్డీఓ, 3 సంక్షేమ శాఖ, 1 సివిల్ సప్లైస్ కు చెందిన ఫిర్యాదులను ఆయా శాఖలకు ఎండార్స్ చేస్తూ, మానవతా దృక్పథంతో త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, వృద్ధులు, దివ్యాంగులు ఉన్నారు.

# సిపిఎం గ్రామ కార్యదర్శిగా పరికి మధుకర్ ఎన్నిక



చెన్నారావుపేట, అక్టోబర్ 26,(జర్నలిస్ట్ వార్త): చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) సిపిఎం గ్రామ కార్యదర్శిగా పరికి మధుకర్ ను పార్టీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు శనివారం సిపిఎం మండల కార్యదర్శి నవీన్ల స్వామి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మధుకర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో గుర్తించి, గ్రామ కార్యదర్శిగా ఎన్నుకున్న పార్టీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని మధుకర్ అన్నారు.

# తిరుపతి రెడ్డిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



రాయపర్తి, అక్టోబర్ 26,(జర్నలిస్ట్ వార్త): తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నూతనంగా ఎన్నికైన హనుమాండ్ల తిరుపతి రెడ్డిని శనివారం తొర్రూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాయపర్తి మండల కాంగ్రెస్ నాయకులు మాచర్ల ప్రభాకర్, ముద్రబోయిన వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట రాయపర్తి మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మునిత, ఐత సాంబయ్య, నల్ల తీగల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు
.

# మృతుని కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ



రాయపర్తి, అక్టోబర్ 26,(జర్నలిస్ట్ వార్త): మండలంలోని సన్నూర్ గ్రామానికి చెందిన పోతుల మురళి శుక్రవారం ఆత్మహత్య చేసుకొని మృతి చెందారు. శనివారం సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మురళీ పార్థివ దేహానికి పూల మాల వేసి, నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ జిల్లా నాయకులు బిల్లా సుధీర్ రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, మాజీ సర్పంచ్ లు నలమాస సారయ్య, జగన్, లక్ష్మీనారాయణ, అశ్రప్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# కార్యదర్శిపై రైతు పోకల శంకర్ ఆరోపణ



పర్వతగిరి, అక్టోబర్ 26,(జర్నలిస్ట్ వార్త): ఇలాంటి అశ్రద్ధ గల పంచాయతీ కార్యదర్శిని ఇప్పటి వరకు చూడలేదని శనివారం పర్వతగిరి రైతు పోకల శంకర్ ఆరోపించారు. ఎంతోమంది పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తూ, గ్రామస్తుల సమస్యలను గుర్తించడం, మరికొన్ని ప్రజల ద్వారా తెలుసుకుని వెంటనే పరిష్కారానికి కృషి చేస్తారు. ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శి వచ్చిన సమయం నుండి ఇప్పటివరకు మండలానికి తిరుగడం, ఉన్నత అధికారుల మన్నలను పొందడం వరకే సమయం సరిపోతుందని ఆరోపిస్తున్నారు. పోలుకమ్మ చెరువు కట్టపై డంపింగ్ యార్డ్ పెట్టి, చెరువును పూడ్చుడానికే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఊరిలో ఎవరైనా మృతి చెందితే వారి దహన సంస్కారాలైన తరువాత స్నానాలు చేయడం ఆనవాయితీ, అందరికీ తెలిసిందే. డంపింగ్ కారణంగా కలుషితమైన నీటిలో స్నానాలు చేయడం వల్ల దురద వస్తుందని, కొంతమంది ఆ భయానికి స్నానాలు చేయకుండానే వెళ్లిపోతున్నారని అన్నారు. కట్టపై తడి, పొడి చెత్త వేయడం ద్వారా వచ్చిపోయే వాహనదారులు, రైతులకు దుర్వాసనతో పాటు కుక్కలు, కోతుల బెడద పెరిగిపోయిందన్నారు. స్థానికులు ఈ సమస్యతో భయబ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా పంచాయతీ కార్యదర్శి డంపింగ్ యార్డును తక్షణమే పరిశీలించి, డంపింగ్ వేరే చోటికి మార్చాలని కోరుతున్నారు.



# అదృశ్యమైన యువకుడు

## పోలీస్ స్టేషన్ లో పిర్యాదు



వర్ధన్నపేట, అక్టోబర్ 26,(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన చొప్పరి రాజేందర్ కుమారుడు చొప్పరి శ్రీరామ్ 15 సం: అనే యువకుడు అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. ఇట్టి విషయమై బాధిత కుటుంబ సభ్యులు వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. బాధితుల పిర్యాదు మేరకు ఎస్సై రాజు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. యువకుడి ఆచూకీ తెలిస్తే, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిందిగా తెలిపారు.

# ట్రోలింగ్ చేస్తే లీగల్ నోటీసులు ఇస్తా...

## నాకు దొరికితే బట్టలూడదీసి కొడతా: జగ్గారెడ్డి



హైదరాబాద్,అక్టోబర్ 26,(జర్నలిస్ట్ వార్త): తాను అనని మాటలను అన్నట్లుగా ట్రోలింగ్ చేస్తే లీగల్ నోటీసులు ఇస్తానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జగ్గారెడ్డి హెచ్చరించారు. తనను ఇష్టారీతిన ట్రోలింగ్ చేస్తున్న వారు తనకు దొరికితే బహిరంగంగానే బట్టలు ఊడదీసి కొడతానని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తనపై, సీఎంపై, ఇతర కాంగ్రెస్ నేతలపై చేస్తున్న ట్రోలింగ్ పట్ల ఆయన తీవ్రంగా స్పందించారు. ఇటీవల కొంతమంది సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రుల మీద కూడా సోషల్ మీడియా వేదికగా అవాకులు, చెవాకులు పేలుతున్నారని జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నాయకుల ప్రసంగాలను ఇష్టారీతిన ఎడిట్ చేసి ట్రోలింగ్ చేస్తున్నారని ఆరోపించారు. తాను ఓ మహిళా కలెక్టర్‌ను బూతులు తిట్టినట్లు సోషల్ మీడియాలో దారుణమైన పోస్టులు పెడుతున్నారన్నారు. కానీ తాను ఏ కలెక్టర్‌నూ దూషించలేదని జగ్గారెడ్డి వివరణ ఇచ్చారు. సోషల్ మీడియాలో తమపై జరుగుతున్న ప్రచారం సరికాదన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా ఓ దండుపాళ్యం బ్యాచ్‌లా తయారయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నిబంధనలు పాటించని ఆస్పత్రులపై ధ్వజమెత్తిన

## వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ



**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 26,(జర్నలిస్ట్ వార్త):** నిబంధనలు పాటించని ఆసుపత్రులపై వరంగల్ జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ ధ్వజమెత్తారు. శనివారం తన సిబ్బందితో కలిసి శివనగర్ హెల్త్ లైన్ డయాగ్నొస్టిక్ సెంటర్, ఫోర్ట్ వరంగల్ ఆర్ఎంపి క్లినిక్ తనిఖీ చేసి, సీజ్ చేశారు. అర్హత, రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్నందుకు వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని వారు తెలిపారు.

ప్రైవేట్ హాస్పిటల్స్, క్లినిక్, పాలిక్లినిక్ నడిపే వారు తప్పనిసరిగా నియమ నిబంధనలు పాటించాలని కోరారు. జిల్లాలో క్లినిక్ లతో పాటు ల్యాబులు, హాస్పిటల్స్, వెల్నెస్ సెంటర్లు, ఫీజియోథెరఫీ సెంటర్లు, కంటి దావకానలు క్లినిక్కులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి, ఆయుర్వేద, యునాని, హోమియో, సిద్ధ, యోగ, నేచురోపతి వంటి అన్ని దావకానలు క్లినిక్ లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. లేనిచో వారిపై పెనాలిటీ వేసి, సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. అటువంటి క్లినిక్ లు, ఆసుపత్రలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయిలోని ప్రత్యేక బృందాలు ప్రతి క్లినిక్, డయాగ్నొస్టిక్ సెంటర్, హాస్పిటల్స్, ఆయుష్ సెంటర్లను తనికీ చేసి, నిబంధనల ప్రకారం లేని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోబడునని తెలిపారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు పేరుకు ముందు డాక్టర్ అని రాసుకోకుడదని అన్నారు. వారు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, ఇంజెక్షన్లు, సెలైన్లు పెట్టరాదన్నారు. అల్లోపతీ వైద్యం చేయరాదని వారి దగ్గర మందుల నిల్వ ఉంచుకోరాదని హెచ్చరించారు. విదేశాలలో వైద్య విద్య అభ్యసించిన డాక్టర్లు తప్పనిసరిగా టెస్టులో ఉతీర్ణులై, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న అనంతరం హాస్పిటల్లో వైద్యం చేయాలని తెలిపారు.

ప్రతి వైద్యుడు తప్పనిసరిగా ప్రిస్క్రిప్షన్ లెజబుల్ గా మాత్రమే వ్రాయాలని కోరారు. ప్రతి క్లినిక్, పోలీక్లినిక్, నర్సింగ్ హోమ్ హాస్పిటల్ ఆయుష్ క్లినికల్, పోలీ క్లినిక్ ఆసుపత్రుల వారు వారి వారి సెంటర్లలో వసూలు చేయి ఫీజుల వివరములు తప్పనిసరిగా తెలుగు, ఇంగ్లీష్ భాషలో రిసెప్షన్ నందు బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆ ప్రకారమే రోగుల నుండి చార్జీలు వసూలు చేయాలని, అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, పరిశుభ్రత, సౌకర్యాలు అందించే విషయంలో ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. వారి, వారి ఇంస్టిట్యూట్స్ లో పని చేసే వైద్యులు వారి రిజిస్ట్రేషన్ నంబర్లు, వారి వారి విద్యార్హతలు రిసెప్షన్ వద్ద ప్రదర్శించాలని తెలిపారు.

ప్రతి హాస్పిటల్ , నర్సింగ్ హోమ్ వారు నిర్ణయించుకున్న రేట్స్ (రాక్ రేట్లను) ప్రతి సంవత్సరం జూన్ నెల మొదటివారంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో అందచేయాలని లేనిచో కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సి-సెక్షన్ కాన్పుల శాతం ఎక్కువగా ఉంటుంది, అనవసరంగా ఇండికేషన్ లేకుండా సి-సెక్షన్ కాన్పులు చేస్తే అట్టి డాక్టర్లపై చర్యలతో పాటు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ కు రాసి సదరు వైద్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంటిపి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు మాత్రమే నిబంధనలకు లోబడి ఇద్దరు డాక్టర్ల సమక్షలో అబార్షన్ చేయాలని, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు లేకుండా అర్హత లేని డాక్టర్లు అబార్షన్ చేస్తే, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వచ్చిన జబ్బుల గురుంచి పేషెంట్లకు తప్పనిసరిగా వారికీ అర్ధమయ్యే భాషలో వివరించాలన్నారు. జబ్బుకు అయ్యే ఖర్చులని ముందుగానే వివరించాలని, రోగుల హక్కులు, బాధ్యతలు ప్రతి ఆసుపత్రిలో తెలిపే విదంగా బోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు.

మలేరియా, డెంగ్యూ, టీబీ, ఎయిడ్స్ వంటి వ్యాధులు సోకిన వారి వివరములు ప్రతినెలా జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు తెలపాలని కోరారు. జిల్లాలో తనికీ బృందాలు నిరంతరం క్లినిక్ లు, ఆస్పత్రలు, తనికీ చేస్తుంటాయని, తనికీ అధికారులు అడిగిన వెంటనే అన్ని రకాల అనుమతులకు సంబందించిన సర్టిఫికెట్లు, సిబ్బంది వివరముల ధరల పట్టికలు చూపించాలని తెలిపారు.

